


# శత్రుత్వం

**కా**ళ్ళు తడబడినై. భుజాన వేలాడుతూన్న గొడ్డలి జారి కింద పడింది. కుడికాలు యెక్కడికో పల్లానికి జారుతూన్నట్టు తోచింది. ఎడం కాలితో నిలతొక్కుకునేందుకు ప్రయత్నించి కుప్పలా అక్కడే ఖాసిం చతికిలపడ్డాడు.

దీపాలు, ఎక్కడో దూరంగా రోడ్డు మీద వేగంగా పాకుతూన్న కార్ల లైట్లు, మినుకు మినుకుమనే మునిసిపల్ లాంతరు స్తంభాలు, కదుల్తూన్న మనుషులు, మెడలోని గంటల చప్పుళ్ళతో నడుస్తూన్న ఎడ్లబళ్ళు.

ఖాసిం అలాగే చతికిలపడిన చోటనే వుండిపోయాడు. కుడికాలి మునివేళ్ళను తడీపొడీగా వున్న నేలలో గుచ్చి, అలా యెడం కాలి మీద పూనిగ్గా వొరిగి, చుట్టూ కలయచూశాడు.

అంతా చీకటి. కదలా మెదలక కొండశిలలా నిదరపోతున్న పణ్ణం కాలవకట్ట. నిశ్శబ్దంగా

నిండుగా ప్రవహిస్తోన్న కాలవ. కొంచెం దూరంగా వులుకుతో భయం భయంగా తూములోంచి కిందకు దూకుతున్న నీటిశబ్దం. నీటివాలుకు యెదురెక్కుతూ అటూ యిటూ గంతులేసే చిన్నా-పెద్ద చేపల సవ్వడి.

ఎడం చేతిని వూతంగా నేల కానించి, కుడికాలును పల్లాన్నుంచి పైకి లాక్కుని ఖాసిం లేచి నిలబడ్డాడు. వచ్చిన కాలిబాటకేసి వెనక్కి చూశాడు. అంతా చీకటి. దూరంగా శ్మశానంలో ఆరిపోయేముందు యెర్రనౌతూన్న నిప్పుకణాలు. గాలికి అడపాదడపా లేస్తూన్న నిప్పురవ్వలు! ఖాసింకు కావలసిన ఆ కదిలే టార్చిలైటు కాంతి యెక్కడా కనపడలేదు!

ఖాసిం తిరిగి కూర్చున్నాడు. తలలో ఏదో నాదు. కణతల్లో చిటపటలు. గుండెల్లో చుర్రుమని కాలుస్తూ మంట. కాళ్ళల్లో జివ్వుమంటూ జాలు. వెన్నెముకలో తీపు. మందకొడిగా ముసురు కుంటూన్న చలి!

ఖాసిం మరోమారు వచ్చిన కాలిబాటకేసి చూశాడు. ఎక్కడా కదిలే టార్చిలైటు కాంతి కనబడ లేదు. ఏం జరిగి వుంటుంది? ఎంత టైమైవుంటుంది?

అతడికి వెంటనే గుర్తుకొచ్చింది, శరభరాజు యిచ్చిన రిస్టువాచీ, జేబులో నుంచి బైటకు తీశాడు. అంత కారుచీకట్లోనూ మినుకు మినుకుమనే రేడియం డయల్. ఎనిమిది గంటలైంది. సరిగ్గా ఎనిమిది గంటలు! యింకా గంటంపావు టైముంది. కనీసం గంట!

ఖాసిం పెదాల మీద, బిరుసు మీసాల నీడలో ఓ చిరునవ్వు కదిలీ కదలనట్టు తోచింది. గళ్ళ లుంగీ ఓమారు గట్టిగా బిగించుకున్నాడు. రొండిన, లుంగీ మడతల్లో పదునుగా పది రూపాయల నోట్లకట్ట చేతికి తగిలింది. వులిక్కిపడ్డాడు. అంతలోనే సముదాయించుకున్నాడు.

తను భయపడుతున్నాడా? ఉహూఁ! అలాంటిదేమీలేదు. ప్రాణులన్నీ తన దృష్టికి ఒకటిగానే కనబడతై. తనది సమదృష్టి! అల్లాహూ అక్బర్! అంతా ఆయన సృష్టి. రెండు కాళ్ళూ, నాలుక్కాళ్ళూ, రెక్కలూ, పొలుసులూ, అంతా ఆయన ఖుషి. శరభ రాజు ఏదో పుస్తకంలోంచి చదివి వినిపించినట్టు, 'చంపేదెవరు? చంపబడేదెవరు?' యిందులోమాత్రం అల్లా-ఈశ్వర్లకు ఏ భేదాభిప్రాయం లేదు!

ఖాసిం బీడీ ముట్టించాడు. చేతిని దొప్పలా ముడిచి చాటుగా ఓ గట్టి దమ్ము లాగాడు. కడుపులో ఏదో వికారం. కాళ్లూ, చేతుల్లో సూదులు గుచ్చినట్టు చురుకు చురుకుమనే మంట. తలలో సీమ టపాకాయల మోత. చెవుల్లో జోరిగల్లా గుంయ్‌మనే ధ్వని.

తను తాగాల్సింది కాదు! గడ్డీగాదంతో పాటు, కుళ్ళేందుకు తయారుగా వున్న ప్రతిదీ యీ దొంగసారా కాపుగాళ్ళు కలుపుతారని తనకు తెలుసు. సూపర్ అమోనియాల్లాంటివి కూడా వేస్తున్నారని తను విన్నాడు. ఐనా...అంత కక్కుర్తిపడి తనెందుకు తాగినట్టు!

భయమా? తను ముక్కూ మొహమూ యెరగనివాణ్ని చంపడమంటే తత్తర పడుతున్నాడా? ధూత్! రహింతుల్లా బిడ్డలకి-ప్రాణంతో పుడుతూనే ప్రాణాలు తీయడం నేర్పకుండానే అబ్బే విద్య!

తను కబేళాలోనే పుట్టాడు. అదంతా భలే చిత్రమైన సంగతి! దాదీ చెపుతూండేది...

ఇత్తడి బుడ్డిదీపం కునారిల్లుతూ ఓ మూల వెలుగుతోంది. కబేళా అంతా చీకటి నీడల

మయం. మేకలూ, గొర్రెపోతులూ తమ ఆఖరి క్షణాలకేసి మెడ తాళ్ళను తెగేలా గుంజుతూ చూస్తున్నయ్. రహింతుల్లా బిస్మిల్లా అంటున్నాడు. కోళ్లు కూసేవేళ. కబేళా బయట కుక్కల కొట్లాట. వుండి వుండి పెద్ద వానజల్లు. కబేళా మేదరి తడికలను రుద్దుకొంటూ, దున్నపోతు చేసే శబ్దం. 'బ్యా' అంటూ అరిచి తన్నుకునే మొండేలు.

మెహరున్నీసా తన తల్లి, తడిక తోసుకుని లోపలికి వచ్చింది. చేతిలో గుడ్డిగా మిణుకుమిణుకు మనే లాంతరు. నిండు గర్భిణి. ఆయాసం. లాంతరు కింద పెట్టి భర్తకేసి చూసింది. రహింతుల్లా బిస్మిల్లా మధ్యలో తలెత్తి చూశాడు. భార్య మెహరున్నీసా!

నెత్తురోడుతున్న కత్తిని కిందపెట్టి రహింతుల్లా భార్యను సమీపించాడు. అతను మాటాడకముందే – ఆమె ఆయాసంగా ఏదో అన్నది. యీతాకులచాప పరిచాడు. మొహరున్నీసా చాపమీద వెల్లకిలా పడుకున్నది. రహింతుల్లా ఓ పాత గొంగళి మీద కప్పి, తిరిగి నెత్తురు గడ్డకట్టుతూన్న కత్తిని చేతికి తీసుకున్నాడు.

తెగిపోతూన్న గొర్రెపొటేళ్ళ తలలు, ఎగిరెగిరిపడుతూన్న మేకల మొండేలు, తలమీద బలమైన గూటాం దెబ్బలకు నాలుక చాచి, 'అంభా' అంటూ పర్వతంలా పక్కకు వొరిగి ఢదేల్‌మంటూ పడిపోతూన్న దున్నపోతు.

పాత గొంగళి కింద కెవ్వుమనే నవశిశువు రోదన. అల్లా అంటూ మొహరున్నీసా చేసిన ఆక్రందన!

ముజాఫర్ యిస్మతుల్లా ఖాసింఖాన్, చివికి చిరిగిపోతూన్న పాతగొంగళి కింది వుక్కలో, చీకట్లో కళ్ళు తెరిచాడు!

❀ ❀ ❀

ఖాసిం బరువుగా కనురెప్పలెత్తి చూశాడు. దూరంగా రోడ్డు మీద కదిలే లైట్లు పలచబడుతున్నయ్. జనసంచారం తగ్గుతోంది.

శరీరంలో అదే వికారం. తలలో అవే చిటపటలు. 'కాపుసారా చేస్తున్న గత్తర' అనుకున్నాడు ఖాసిం. లేచి నిలబడ్డాడు. జేబులోంచి రిష్టువాచీ తీసి చూశాడు. యింకా ముప్పావుగంట టైముంది. వాచీ చేతికి కట్టుకుంటే? అలా చేయొద్దని చెప్పాడు శరభరాజు. చీకట్లో దాని మొహం మెరుస్తూ కనబడుతుంది. తను యిట్టే బయటపడిపోతాడు!

ఖాసిం కళ్ళు పెద్దవి చేసుకుని చుట్టూ చూశాడు. యింకా ఆ చీకటికి తన కంటి పాపలు అలవడలేదు. వారం రోజులుగా తను ఆ చుట్టుపట్ల కాపలా వేస్తున్నాడు. ఆ పరిసరాలన్నీ తనకు బాగా తెలుసుననుకున్నాడు. కాని, యిప్పుడు తీరా చూడపోతే అంతా కొత్తగానే కనబడుతోంది.

పచ్చగా నవనవలాడుతూ పెరిగి వస్తూన్న వసుపు తోటా, పక్కనే చిన్న పంటకాలవా, ఓమూల గుబురుగా పెరుగుతూన్న కొబ్బరి చెట్లూ, ఆ పక్కనే బావి, పాడుపడిన ఆ పెద్ద గాడిబావి – అవన్నీ ఎక్కడ?

తల తిరుగుతూన్నట్టుంది. కాళ్ళల్లో తీపు. కడుపులో వికారం. ఓ గ్లాసెడు చల్లని మంచినీరు

దొరికితే? తలని బాగా చన్నీళ్ళలో ముంచి తడుపుకుంటే?

ఖాసిం కళ్ళు కుంచించి ఆ చీకటినంతా కలయచూశాడు. చెవులు రిక్కించి విన్నాడు. దూరంగా ......బహుశా చాలా దగ్గర్లోనే యేమో! నీళ్ళు తూములోంచి కిందికి దూకుతున్న ధ్వని.

ఖాసిం ఆ వైపుకు నడిచాడు. కళ్ళతో చూస్తూ కాదు. ఆ కారుచీకటిలో, చీకటి నలుపు తప్ప చూసేందుకేముంది! చెవుల్తో వింటూ ఆ ధ్వని వచ్చిన వేపుకే....ఒకటి.... రెండు – అడుగు తీసి అడుగు వేస్తున్నాడు. మరో అడుగు యింకో....ఉహుఁ. నేల తగలలేదు. శరీరం గాలిలో యెగురు తూన్నట్టు ఉహూఁ, కిందికి పోతూన్నట్టు...గట్టిగా నీళ్ళను తాకిన శబ్దం. అడుక్కి నీళ్ళలోంచే ఇంకా ఇంకా అడుక్కి. బురదలో కాళ్ళు గుచ్చుకున్నయ్. వుక్కిరిబిక్కిరౌతూ నీళ్ళు తాగాడు. అటూ యిటూ గిలగిల కొట్టుకున్నాడు. బురదలోంచి, వూబిలోంచి కాళ్ళు పెనుగులాడి బైటపడినై. చేతులు కదులుతున్నయ్. కాళ్లు కదులుతున్నయ్. పైకి, యింకా పైకి, వూపిరి ఆడడంలేదు. వూపిరి బిగపట్టేస్తోంది. నీళ్ళు తాగుతున్నాడు. హఠాత్తుగా తల నీటి మీదికి తేలింది. అంచు....నున్నగా పాకుడు పట్టిన పెద్దరాళ్ల నున్నని అంచు...ఎక్కడా పట్టు చిక్కడంలేదు. మళ్ళీ తను అడుక్కి పోతున్నాడా? యిదేనా అల్లా తనకు నిర్ణయించిన చావు? కబేళా, తల్లి మెహరున్నీసా, తను చంపేందుకు వచ్చిన పకీరయ్య...అన్ని దృశ్యాలూ అతడి కళ్ళ ముందు కదుల్లాడినై.

పట్టు! చేతికి యేదో పట్టు తగిలింది. రెండు పెద్దరాళ్ళ మధ్య కొద్దిగా చేతి నాలుగు వేళ్ళు పట్టేంత చిన్న కాళీ. తేలిగ్గా నీళ్ళల్లో తేలుతూ చేతి నాలుగు వేళ్ళతో అక్కడ ఆ కాళీ దొరికినచోటున గట్టిగా పట్టుకున్నాడు. బొటనవేలు కూడా దూరేంత కాళీ వుంటే, తను యెంత సేపయినా అలా తేలుతూనే వుండొచ్చు! కాని....

చేతివేళ్లు తిమ్మిర్లెత్తుతున్నయ్. తను యెంతోసేపు ఆ పట్టుతో తేలుతూ వుండలేడు. యీ పాడుపడిన గాడిబావిలోంచి తన నెవరు వెలికి తీసేట్టు? యీ దారిన యీ రాత్రివేళ యెవరు వస్తారు? పకీరయ్య! తను చంపేందుకు పొంచికూర్చున్న పకీరయ్య! అతడే తనకు ప్రాణదానం చేయాలి. తన శత్రువు! ఆ మాటకొస్తే పకీరయ్యా తనకు చేసిన అన్యాయం యేమీ లేదు. శరభరాజు పెళ్లాన్ని లేపుకుపోయాడు. వాళ్ళూ వాళ్ళూ శత్రువులు కావొచ్చు! తనకు మాత్రం శరభరాజు యిచ్చిన యిరవై పది రూపాయల నోట్లు తీసుకున్న తరవాతనే శత్రువయ్యాడు పకీరయ్య.

టార్చిలైటు కాంతి, బావి మీదగా ఓమారు మెరిసి ఆరిపోయింది. పకీరయ్య! కాలిబాట గాడిబావి పక్కగానే వుంది. ఖాసిం వేళ్ళ పట్టు జారింది. ఒక మునక తీస్తూనే పెద్దగా అరిచాడు. మరుక్షణంలో ఆ చీకటి కోణాన్ని వెతుకుతూ టార్చిలైటు వెలుగు.

“ఆఁ! ఎవరు? ఎవరు?” – బావిపై నుంచి ఆదుర్దాగా ప్రశ్న.

“నేను! నేనే పకీరయ్యా!” – ఖాసిం ఆర్తనాదం.

“వొస్తున్నా! యిప్పుడే...”

ఖాసింకు మళ్లీ ఆ రాళ్ళ సందు కాళీలో పట్టు చిక్కింది. కాని యీసారి తన చేతి వేళ్ళకి

స్పర్శజ్ఞానమే వున్నట్టు లేదు. నీళ్లు బాగా తాగాడు.

టార్చిలైటు కాంతితోపాటు, పొడుగాటి కొబ్బరిమట్ట బావిలోకి దిగింది. ఖాసిం రెండు చేతుల్తో గట్టిగా మట్ట పట్టుకున్నాడు. అంగుళం అంగుళంగా పైకి, బావి నుంచి బయటికి, భూమి మీదికి!

పకీరయ్య! గొడ్డలి భుజాన పెట్టుకుని, తాచుపాములా బుసలుకొడుతూన్న పకీరయ్య! ఖాసిం మొహంమీద కళ్ళార్పకుండా వెలుగుతూన్న టార్చిలైటు కాంతి.

"నువ్వెవరు? నా పేరు పకీరయ్యని ఎలా తెలుసు?"

ఖాసిం తత్తరపోయాడు. రొండిన ఓ వైపున తడిసి బిగుసుకుపోతున్న పది రూపాయిల నోట్ల కట్ట. రెండో వైపున చల్లగా తాకుతూన్న పేష్ కత్తి. తను దొరికిపొయ్యాడు. పకీరయ్య నెత్తిన పడవలసిన తన చేతి గొడ్డలి, తన నెత్తినే పడేందుకు సిద్ధంగా వుంది.

"శరభరాజు చెప్పాడు. నిన్ను చంపేందుకు పంపాడు"

పకీరయ్య నవ్వాడు. ఆ నవ్వులో క్రోధం లేదు. ఏదో పశ్చాత్తాపం.

"తన పెళ్ళాన్ని లేపుకొచ్చానని. అందుకేనా?" అన్నాడు పకీరయ్య అదే నవ్వుతో.

"హుఁ! అందుకే మరి...." – ఖాసింకు ఆపైన ఏమనాలో తెలిసింది కాదు.

పకీరయ్య వికృతంగా నవ్వాడు. టార్చిలైటును ఖాసిం మొహం మీంచి బావి వైపుకు వేశాడు.

"శరభరాజు పెళ్లాన్ని నేను లేపుకువచ్చాను, నా దగ్గర నుంచి నెల రోజుల నాడు మరొకడు లేపుకు పోయాడు. బహుశా...యీ సరికి వాడి దగ్గిర నుంచి మరొకడు లేపుకుపోయి వుండొచ్చు. నువ్వెంతమందినని చంపుతావ్. పైగా యిప్పుడు నా చేతిలో...."

ఖాసిం ఒక్క గంతులో మెరుపులా ముందుకు వురికాడు. నల్లగా కరుడు కట్టిన చీకటినీడలా కనబడుతూన్న పకీరయ్య పొట్ట మీద గట్టిగా తలతో పొడిచాడు. పెద్ద మూలుగు. ఒరిగి కిందపడి పోతూన్న చీకటి నీడ. మరుక్షణంలోనే గొడ్డలి ఖాసిం చేతులో కవ్విస్తూ కదుల్లాడింది.

"నిన్ను చంపను! ఉహుఁ! చంపను. ఫో!" అన్నాడు ఖాసిం నిండుగా.

"ఏఁ?"

"చస్తూన్న నన్ను బతికించావ్! నువ్వు చచ్చిపోయావ్!"

నిశ్శబ్దం! ఓ రెండు మూడు క్షణాలు యెటు నుంచీ జవాబు లేదు.

గొడ్డలి భుజాన పెట్టుకుని ఖాసిం రెండడుగులు వేసి వెనక్కి తిరిగి –

"చచ్చిపోయినవాడెవడూ శరభరాజు కంటపడదు! తెలుసా?" అన్నాడు కర్కశంగా.

"అవును! శరభరాజు కంటికే కాదు, యీ జిల్లా వాళ్ళ కంటే పడదు!"

పకీరయ్య నీరసంగా లేచి నుంచున్నాడు.

"ఆఁ! సలాం!" అన్నాడు ఖాసిం.

ఆ చీకటిలో ఆ రెండు ఆకారాలూ రెండు మార్గాలకేసి నడిచినై.

❋

*(ఆంధ్రజ్యోతి మాసపత్రిక : 1940–49 మధ్య)*